# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 01 జనవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4






పాఠకులు, ప్రకటనకర్తలు,
ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు బలగం టీవీ తరపున
ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు
- బలగం టీవీ సీఈఓ బాలు కాయితీ


## ఉద్యోగుల పెండింగ్ బిల్లులు రూ.713 కోట్లు విడుదల

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల్లో డిసెంబర్‌కు సంబంధించిన రూ.713 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు బుధవారం డిసెంబర్ నెలకు చెందిన రూ.713 కోట్ల బిల్లులను విడుదల చేశారు. ప్రతినెలా రూ.700 కోట్ల చొప్పున పెండింగ్ బిల్లులను విడుదల చేస్తామంటూ ఉద్యోగ సంఘాలకు ప్రజా ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. జూన్ నెలాఖరులో రూ.183 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ తర్వాత ఆగస్టు నుంచి ప్రతినెలా కనీసం రూ.700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వచ్చింది. ఉద్యోగుల గ్రాట్యూటీ, జీపీఎఫ్, సరెండర్ లీవులు, అడ్వాన్స్‌లకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం విడుదల చేసింది. డిసెంబర్‌కు సంబంధించి రూ.713 కోట్ల పెండింగ్ బిల్లులు విడుదల చేయడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## గిగ్ వర్కర్ల సమ్మె విజయవంతం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**


గిగ్ వర్కర్స్ ఇచ్చిన సమ్మె పిలుపునకు ఫుడ్ యాప్ యాజమాన్యాలు దెబ్బకు దిగివచ్చాయి. డెలివరీ బాయ్స్ డిమాండ్‌లకు తలొగ్గి పలు ప్రోత్సాహకాలు అందించడానికి ముందుకు వచ్చాయి. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బెస్ట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్‌లు సమ్మెకు పిలుపునిచ్చాయి. దీంతో ముందు జాగ్రత్తగా వ్యాపారం నష్టపోతామనే భయంతో ఫుడ్ యాప్‌లు పలు ప్రోత్సాహకాలను ప్రకటించాయి. ఈ ప్రభావంతో పలు చోట్ల సమ్మె మిశ్రమంగా జరిగింది. ఏడాది చివరి రోజు ఆటంకం కలగకూడదన్న ఉద్దేశ్యంతో ఫుడ్ డెలవరీ సంస్థలు స్విగ్గీ, జొమాటో, జెప్టో తదితర సంస్థలు పలు ప్రోత్సాహకాలను ప్రకటించాయి. డిసెంబర్ 31న సాయంత్రం ఆరు గంటల నుంచి 12 గంటల మధ్య పనిచేసే గిగ్‌వర్కర్లకు ఒక్కో ఆర్డర్‌కు రూ.120–రూ.150 చెల్లిస్తామని జొమాటో ప్రకటించింది. ఆర్డర్లను బట్టి ఒక్కొక్కరు సగటున రూ.3వేలు ఆర్జించవచ్చని పేర్కొంది. అదే విధంగా కాన్సిలేషన్లు, ఆర్డర్లు తీసుకోకపోవడం వంటి వాటిపై జరిమానాలు కూడా విధించబోమని హామీ ఇచ్చింది. జొమాటో తరహాలోనే స్విగ్గీ కూడా తన డెలివరీ బాయ్స్‌కు ఆఫర్స్‌ను ప్రకటించింది. పీక్ అవర్స్‌లో రూ.2వేల వరకు సంపాదించుకోవచ్చని పేర్కొంది. క్విక్ కామర్స్ వేదిక జెప్టో కూడా ప్రోత్సా హకాలు ప్రకటించింది. దేశ వ్యాప్తంగా డిసెంబర్ 25న గిగ్‌వర్కర్లు సమ్మె చేపట్టి ఫుడ్ యాప్‌లకు ఝలక్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో డెలివరీ యాప్స్‌పై తీవ్ర ప్రభావం పడ్డాయి. కొత్త సంవత్సరం ముందు రోజు భారీగా ఆర్డర్లు ఉండ టంతో మళ్లీ ప్రభావం పడొచ్చనే భయంతో ఆయా యాజమాన్యాలు గిగ్‌వర్కర్లకు ప్రోత్సాహకాలు పెంచి తాత్కాలికంగా బయటపడ్డాయని తెలుస్తోంది.

## గోదావరి నీటిని ఏపీకి మళ్లింపును అంగీకరించం

- కేంద్రంపై ఒత్తిడితో పాటు న్యాయ పోరాటం చేస్తాం
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గోదావరి నీటిని ఆంధ్రప్రదేశ్ ఏ రూపంలో మళ్లించినా అంగీకరించే ప్రసక్తే లేదని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారమొక ప్రకటనలో పేర్కొన్నారు. గోదావరి ట్రిబ్యునల్ 80 టీఎంసీలకు అనుమతి ఇచ్చిందనీ, అంతకంటే ఒక్క చుక్కనీరు ఎక్కువ తీసుకెళ్లినా ఉపేక్షించబోమని తెలిపారు. తమ ప్రభుత్వం అడ్డుకోవడం వల్లే గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఏపీ ఉపసంహ రించుకుందని వివరించారు. దాని స్థానంలో గోదావరి- నల్లమలసాగర్ ప్రాజెక్ట్‌ను ప్రతిపాదించిందని తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), గోదావరి వాటర్ డిస్ట్రిబ్యూట్ ట్రిబ్యునల్ (జీడబ్ల్యూడీటీ), పునర్విభజన చట్టానికి వ్యతిరేకంగా ఏపీ తీసుకున్న నిర్ణయాన్ని అడ్డుకుంటామని



స్పష్టం చేశారు. ఒక వైపు కేంద్రంపై ఒత్తిడి తెస్తూనే న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాశయాల్లో 200 టీఎంసీల నీటిని మళ్లించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నికర జలాలు కాకుండా అదనపు జలాలపై ఆధారపడి ప్రాజెక్ట్ చేపట్టడం సరికాదన్నారు. వరద రాని సీజన్‌లో నికర జలాలను మళ్లిస్తారనీ, ఫలితంగా తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. అదనపు వాటా కోరినపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఏపీ తీసుకుంటున్న ప్రణాళికలు వెలుగులోకి రాగానే తక్షణమే స్పందించి జనవరి 22న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు, జూన్ 13, 16 తేదీల్లో జలశక్తితో పాటు పర్యావరణ, అటవీ శాఖలకు లేఖలు రాశామని గుర్తు చేశారు. అంతర్రాష్ట్ర వివాదాలు పరిష్కారం కాలేదని, గోదావరి నది యాజమాన్య బోర్డు నిబంధనలకు విరుద్ధమని, వరద నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ అనుమతి అవసరమని పేర్కొన్నారు. అయినా ఆంధ్రప్రదేశ్ గతేడాది నవంబర్ 21న టీపీఆర్ టెండర్లను పిలవడంతో, తెలంగాణ ప్రభుత్వం డిసెంబర్ 16, 2025న సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ నెం.1258/2025 దాఖలు చేసిందని తెలిపారు. గోదావరిలో తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీల నీటి హక్కులను కాపాడుకోవడమే మా ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. తాము నిర్లక్ష్యం చేస్తున్నామని ప్రతిపక్షాలు చెప్పడం అసత్యమని తెలిపారు. తెలంగాణా నీటి వాటాల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తేల్చి చెప్పారు.

## రాష్ట్ర ప్రజలకు సీఎం నూతన సంవత్సర శుభా కాంక్షలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్–2047 లక్ష్యసాధన దిశగా 2026లో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులతో పాటు మహిళలు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని గుర్తు చేశారు. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలనీ, ప్రజలందరూ ఆనందంతో, ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తాం

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో కొత్త సంవత్సరంలో ప్రభుత్వ వైద్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామనీ, కొత్త సంవత్సరంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీనిచ్చారు. రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2026లో నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్ నివారణ, నియంత్రణ, చికిత్స, పాలియేటివ్ కేర్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఇప్పటికే ఎన్‌డీడీసీ క్లినిక్స్, కేర్ కేన్సర్ క్లినిక్‌ల ద్వారా గ్రామాల సమీపంలోకి వైద్యసేవలను తీసుకెళ్లామని మంత్రి గుర్తుచేశారు. ఎమర్జెన్సీ కేర్‌పై మరింత దృష్టి సారించామనీ, వందకుపైగా క్రిటికల్ కేర్ బ్లాక్స్, ట్రామా కేర్ సెంటర్లు అందుబాటులోకి తీసుకొస్తామని హామీనిచ్చారు. కొత్త ఏడాదిలో నాలుగు కొత్త మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులను తీసుకొస్తామని వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందని పేర్కొన్నారు.

## 2025లో రూపాయి 4.7 శాతం పతనం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి మారకం విలువ వరుసగా రెండో నెలలోనూ పతనమయ్యింది. డిసెంబరులోనూ నష్టంతో ఈ ఏడాదిని ముగించింది. చివరి నెలలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ భారత దేశ చరిత్రలోనే 91 స్థాయిని దాటి ఆల్‌టైం కనిష్ట స్థాయిని చవి చూసింది. బుధవారం నాటి ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 89.87 వద్ద ముగిసింది. ఈ నెలలో స్థూలంగా 0.5 శాతం విలువ కోల్పోయింది. 2025 ఏడాదిలో మొత్తంగా రూపాయి విలువ 4.7 శాతం క్షీణించింది. ఇది గత మూడేళ్లలో నమోదైన అతిపెద్ద వార్షిక పతనం కావడం ఆందోళనకరం. ఈ ఏడాది పొడవునా రూపాయిపై ప్రభావం చూపిన అంశాలే డిసెంబరులోనూ కొనసాగాయి. భారతీయ ఈక్విటీల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులను ఉపసంహ రించుకోవడం, దిగుమతిదారులు హెడ్జింగ్‌ను పెంచడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరకపోవడం వంటివి రూపాయి పతనానికి కారణమయ్యాయి. “విదేశీ ఇన్వెస్టర్ల నిరంతర నిధుల ఉపసంహరణ, రక్షణ, చమురు, బంగారం రంగాల నుండి డాలర్ డిమాండ్ అన్నీ రూపాయిపై ప్రభావాన్ని చూపుతున్నాయి,” అని ఫిన్‌రెక్స్ ట్రెజరీ అడ్వైజర్స్‌కు చెందిన ట్రెజరీ హెడ్ అనిల్ భన్సాలీ తెలిపారు.

## ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడి వృద్ధురాలు మృతి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హనుమకొండ జిల్లా పరకాల పట్టణ నడిబొడ్డున బస్టాండ్‌లో బుధవారం ఘోర ప్రమాదం జరిగింది. ములుగు జిల్లాకు చెందిన ఓ వృద్ధురాలు ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడి మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే... వరంగల్–2 డిపోకు చెందిన బస్సు భూపాలపల్లి నుంచి హనుమకొండ వైపు వెళ్తూ పరకాల బస్టాండ్‌లోకి మలుపు తీసుకుంది. రోడ్డు మలుపు వద్ద ఇరుకుగా ఉండటం, తోపుడు బండ్లు ఉండటంతో డ్రైవర్‌కు రోడ్డుపై నడుస్తున్న రాధమ్మ(70) కనిపించలేదు. బస్సు మలుపు తిరుగుతున్న వేగంలో ఆమెను బస్సు ఢీకొట్టింది. దాంతో బస్సు ముందు టైర్ వృద్ధురాలుపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలు పాల్సావ్‌పల్లికి చెందిన తోట రాధమ్మగా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఏడాది చివరి రోజు మార్కెట్లకు లాభాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నాలుగు రోజులుగా వరుస నష్టాలు చవి చూసిన సూచీలు ఏడాది చివరి రోజు లాభాల్లో ముగిశాయి. బుధవారం బీఎస్ఈ సెన్సెక్స్ 545.52 పాయింట్లు లేదా 0.64 శాతం పెరిగి 85,220కి చేరింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 190.75 పాయింట్లు లేదా 0.74 శాతం లాభపడి 26,129 వద్ద ముగిసింది. దీంతో ఒక్కరోజులోనే మదుపర్ల సంపద రూ.4 లక్షల కోట్లు పెరిగింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ రూ.472 లక్షల కోట్ల నుంచి రూ.476 లక్షలకు కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్ షేర్లు అధికంగా లాభపడ్డాయి. టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా షేర్లు అధిక నష్టాలను చవి చూశాయి.

## భూతల స్వర్గధామం ములుగు ప్రకృతి అందాలు



- పంచాయతీరాజ్, మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ములుగు జిల్లా పర్యాటకులకు భూతల స్వర్గధామంగా ఉందని, సహజసిద్ధ ప్రకృతి అందాలు, భక్తి, ఆనందం, ఆహ్లాదంతోపాటు చారిత్రాత్మక నేపథ్యం కలిగిన పర్యాటక ప్రదేశాలు నెలవై ఉన్నాయని పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు జిల్లా పర్యాటక అందాలను చూడటానికి వచ్చే పర్యాటకులకు సాదర ఆహ్వానం పలుకుతున్నామని చెప్పారు. తాడ్వాయి మండల కేంద్రంలో బుధవారం ఎకో టూరిజం ఏటూరు నాగారం వైల్డ్ లైఫ్‌లోని తాడ్వాయి వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ రేంజ్, తాడ్వాయి హాట్స్, రెండు సఫారీ వాహనాలను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా తాడ్వాయి హాట్స్ ఆవరణలో ఉన్న వివిధ జాతులకు చెందిన వృక్షాలు, వాటి ప్రయోజనాల గురించి పూర్తి వివరాలను డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ వివరించారు. ఆ తర్వాత వారంతా సఫారీ వాహనంలో తాడ్వాయి వైల్డ్ లైఫ్ రేంజ్ సుమారు 7 కిలోమీటర్ల మేర పర్యటించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు.. ఎకో టూరిజం ఏటూరు నాగారం వైల్డ్‌లైఫ్‌లోని తాడ్వాయి వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ రేంజ్‌లోని తాడ్వాయి హాట్స్‌ను ఆధునీకరణంగా సుందరీకరించి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.

ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ప్రపంచ పర్యాటకులను సైతం ఆకట్టుకుంటుందని, రామప్ప సరస్సు మధ్యగల ద్వీపకల్పంలో నూతనంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. త్వరలోనే పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. కొండల మధ్య కాకతీయులు నిర్మించిన లక్నవరం సరస్సు ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకుంటుందని వివరించారు. పస్రా–తాడ్వాయి జాతీయ రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దట్టమైన అటవీ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కలిగిన బ్లాక్ బెర్రీ ఐలాండ్‌ను పున్నప్రారంభించినట్లు తెలిపారు. ఇక్కడికి వచ్చే పర్యాటకులకు నైట్ క్యాంప్ విడిది కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. తెలంగాణ నయాగరా బొగత వాటర్ ఫాల్స్ చూపరులను ఆకట్టుకుంటుందన్నారు.

## నేటి నుంచి 31 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



జనవరి ఒకటి నుంచి 31వ తేదీ వరకు జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో రోడ్డు భద్రతా మాసోత్సవం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. 30 రోజుల ప్రణాళికను అమలుచేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తామని హామీపత్రం ఇవ్వాలని కోరారు. ప్రతిపాఠశాల రోడ్డు భద్రతా క్లబ్‌లో చేరాలని సూచించారు. రవాణా శాఖ సూచనలు పాటించాలనీ, హెల్మెట్ ధరించాలనీ, మద్యం తాగి వాహనం నడపరాదనీ, రాంగ్ రూట్లో ప్రయాణం చేయకూడదనీ, అతివేగంతో వాహనం నడపొద్దని వివరించారు. రోడ్డు ప్రమాదాల వల్లే మరణాలు అధికంగా జరుగుతున్నాయని అధికారక లెక్కలు చెబుతున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతోపాటు అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. రోడ్డు భద్రతా ఉత్సవాల్లో భాగంగా రవాణా శాఖ 30 రోజుల ప్రణాళికను రవాణా శాఖ విడుదల చేసింది. జనవరి ఒకటి నుంచి 31 వరకు వివిధ రకాల కార్యక్రమాలను చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించింది. ఒకటిన హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవం ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా సీటు బెల్ట్ పెట్టుకోవడం, హెల్మెట్ ధరించడం, విద్యార్థులు, యువతను భాగస్వామ్యం చేయడం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. 31న ముగింపు సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులతోపాటు ఇతరులకు అవార్డులు ఇస్తారు.

## ‘వర్కర్ టు ఓనర్’ పథకాన్ని సంక్రాంతి లోపల అమలు చేయాలి

- ఆసాముల లిస్టును ఫైనల్ చేసి, అర్హులైన నేత కార్మికులకు లెటర్లు కేటాయించాలి
- లేకపోతే సిరిసిల్లలో 10 వేల మందితో మహా ధర్నా
- సిరిసిల్లలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల శాసనసభ్యుడిగా బీఆర్ఎస్ తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ‘వర్కర్ టు ఓనర్’ అనే విప్లవాత్మక కార్యక్రమాన్ని సంక్రాంతి లోపలే వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లుగా ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేస్తూ, పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం మొద్దు నిద్ర నుంచి మేల్కొని, సంక్రాంతి లోపలే ‘వర్కర్ టు ఓనర్’ పథకాన్ని ప్రారంభించాల్సిందే అని స్పష్టం చేశారు. ఈ పథకం సమర్థవంతంగా అమలవ్వాలంటే, గతంలో రూపొందించిన ప్రణాళికలకు అనుగుణంగా పవర్ లూమ్‌లను సబ్సిడీపై కొనుగోలు చేయడానికి అవసరమైన నిధులను వచ్చే బడ్జెట్‌లో పూర్తిస్థాయిలో కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే సంక్రాంతి లోపలే ఆసాముల లిస్టును ఫైనల్ చేసి, అర్హులైన నేత కార్మికులకు లెటర్లు కేటాయించాలి అని కోరారు. ఒకవేళ సంక్రాంతి లోపల ఈ ప్రక్రియ పూర్తిచేయకపోతే, సంక్రాంతి అనంతరం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని నేతన్నలందరినీ, నేత కార్మికులందరినీ సమీకరించి ఆందోళనకు దిగుతామన్నారు. కేసీఆర్ గారు ఈ బృహత్తర కార్యక్రమాన్ని కెసిఆర్ ప్రారంభించారని, ఆ కార్యక్రమాన్ని నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఇక్కడే మహా ధర్నా కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. దాదాపు 10,000 మంది నేతన్నలతో సిరిసిల్ల పట్టణం మొత్తం కదిలే స్థాయిలో ఈ ఉద్యమం ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను, నేతన్నల జీవితాలను కాపాడేందుకు తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ గారు చూపిన దూరదృష్టి, మానవీయత, రాజకీయ సంకల్పం చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. కేసీఆర్ గారు కరీంనగర్ ఎంపీగా ఉన్న 2005లోనే సిరిసిల్ల నేతన్నల దుస్థితిని, వస్త్ర పరిశ్రమలో నెలకొన్న తీవ్ర సంక్షోభాన్ని గుర్తించి స్పందించిన నాయకుడని గుర్తు చేశారు. ఒక్క వారం వ్యవధిలో తొమ్మిది మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకున్న ఘటనలతో చలించిపోయిన కేసీఆర్ గారు, రాష్ట్ర ప్రభుత్వానికి సోయి రావాలనే ఉద్దేశంతో పార్టీ తరపున 50 లక్షల రూపాయలను సిరిసిల్ల పద్మశాలి సమాజానికి అందజేసి, నేతన్నలను ఆదుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. ఆ రోజే సిరిసిల్లలో కేసీఆర్ గారు “తెలంగాణ వచ్చే వరకు ధైర్యంగా ఉండండి, తెలంగాణ వచ్చిన తర్వాత నేను మిమ్మల్ని ఆదుకుంటాను, కాపాడుకుంటాను” అని ఇచ్చిన మాటను, ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్షరాలా నిలబెట్టుకున్నారని బీఆర్ఎస్ స్పష్టం చేసింది. వస్త్ర పరిశ్రమను, ముఖ్యంగా సిరిసిల్ల నేత కార్మికులను కంటికి రెప్పలా కాపాడిన నాయకత్వం కేసీఆర్ గారిదేనని కొనియాడింది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు 3,400 కోట్ల రూపాయల విలువైన బతుకమ్మ చీరల ఆర్డర్లను అందించి నేతన్నల బతుకులను మార్చడమే కాకుండా, తెలంగాణ ఆడబిడ్డలకు పండుగ కానుకగా చీరలు అందించిన గొప్ప ఆలోచన కూడా కేసీఆర్ గారిదేనని పేర్కొన్నారు. సంవత్సరానికి కోటి మంది మహిళలకు బతుకమ్మ పండుగ సందర్భంగా చీరలు అందించిన ఏకైక ప్రభుత్వం కేసీఆర్ గారి ప్రభుత్వమేనని గుర్తు చేశారు.



బతుకమ్మ చీరల పథకం వెనుక ఉన్న లోతైన ఆలోచనను వివరిస్తూ, అప్పటివరకు నేత కార్మికులు నెలకు 8 నుంచి 10 వేల రూపాయలే సంపాదిస్తూ జీవన కష్టాలు పడుతున్నారని, వారి కుటుంబాల్లో మహిళలు బీడీలు చుడుతూ తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందుకే బీడీ కార్మికులకు నెలకు 2,000 రూపాయల పెన్షన్‌ను 4.5 లక్షల మందికి అమలు చేయడమే కాకుండా, నేత కార్మికుల ఆదాయం 15%–%20 వేల రూపాయలకు పెరగాలనే లక్ష్యంతో బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చారని వివరించారు. ఈ చర్యలతో సిరిసిల్ల దశ తిరిగిందని, నేతన్నలకు స్థిరమైన ఆదాయం లభించిందని పేర్కొన్నారు. తదుపరి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఉన్న మూడంచెల వ్యవస్థను అధ్యయనం చేయాలని కేసీఆర్ గారు అధికారులను ఆదేశించారని, కార్మికులు%–%ఆసాములు%–%సేట్లు అనే వ్యవస్థలో కార్మికుడు కార్మికుడిగానే మిగిలిపోవాల్సిన పరిస్థితి ఎందుకు ఉండాలని ప్రశ్నిస్తూ, కార్మికుడిని ఆసామిగా మార్చే విప్లవాత్మక ఆలోచనతో ‘వర్కర్ టు ఓనర్’ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఇది దేశంలోనే కాక, బహుశా ప్రపంచంలోనే ఎక్కడా లేని వినూత్న పథకమని పేర్కొన్నారు.

బీడీలు చుడుతూ ఆరోగ్యాన్ని కోల్పోతున్న మహిళలకు మంచి వాతావరణంలో ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో సిరిసిల్ల పట్టణం పక్కనే 200 ఎకరాల్లో అపెరల్ పార్కును, దానికి అనుసంధానంగా వర్కర్ టు ఓనర్ కార్యక్రమాన్ని 400 కోట్ల రూపాయలతో కేసీఆర్ గారు ప్రారంభించారని వివరించారు. దాదాపు 50 షెడ్ల నిర్మాణాలు రెండేళ్ల కిందటే పూర్తయ్యాయని, పవర్ లూమ్‌లను సబ్సిడీపై అందించి కార్మికులనే యజమానులుగా మార్చాలనే అద్భుత ఆలోచన దీనిలో ఉందని తెలిపారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని బీఆర్ఎస్ తీవ్రంగా విమర్శించింది. షెడ్లన్నీ నిరుపయోగంగా మారి, పిచ్చి చెట్లు మొలిచి, కనీస నిర్వహణ కూడా లేకుండా అధ్వాన స్థితిలో ఉన్నాయని, కొన్నిచోట్ల వాటిని వడ్ల నిల్వలకు ఉపయోగించడం కాంగ్రెస్ ప్రభుత్వ అవివేకానికి నిదర్శనమని ఆరోపించింది. ఇది 400 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృథా చేసే ప్రయత్నమే అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ తరపున చేస్తున్న డిమాండ్ ఒక్కటేనని నేతలు స్పష్టం చేశారు. కేసీఆర్ గారి ఆలోచన ప్రకారం నేత కార్మికులు ఆసాములుగా, వర్కర్ ఓనర్లుగా మారాలని, సిరిసిల్ల ఒక తిరుపూర్ మాదిరిగా వేల కోట్ల రూపాయల వస్త్ర ఉత్పత్తి కేంద్రంగా ఎదగాలని బీఆర్ఎస్ ఆకాంక్షగా పేర్కొన్నారు. కేసీఆర్ గారి హయాంలో అపెరల్ పార్కులో గ్రీన్ నీడిల్, టెక్స్‌పోర్ట్ అనే రెండు పరిశ్రమలను తీసుకువచ్చామని, వాటిలో తయారయ్యే ఉత్పత్తులు న్యూయార్క్‌కు ఎగుమతి అవుతున్నాయని, దాదాపు 2,000 మంది మహిళలకు ఉపాధి లభిస్తోందని తెలిపారు. కనీసం 1,500 మంది నేత కార్మికులను ఆసాములుగా, అపెరల్ పార్కులో 25,000 మంది మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు రూపకల్పన జరిగిందని గుర్తు చేస్తూ, సంక్రాంతి లోపల చర్యలు తీసుకోకపోతే ఉద్యమం తప్పదని బీఆర్ఎస్ మరోసారి స్పష్టంగా హెచ్చరించింది.

## పారిశుధ్యంలో జీహెచ్ఎంసీ రికార్డు విజయాలు

**స్వచ్ఛసర్వేక్షణలో 6వ ర్యాంకు**

**7 స్టార్ గార్బేజ్ ఫ్రీ సిటీగా హైదరాబాద్**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జీహెచ్ఎంసీ 2025 సంవత్సరంలో పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజారోగ్యం, మౌలిక వసతులు, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో కీలక విజయాలు సాధించిందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. స్వచ్ఛత ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం, జీహెచ్ఎంసీ చేపట్టిన చర్యల వల్ల స్వచ్ఛ సర్వేక్షణ–2025లో దేశవ్యాప్తంగా 6వ ర్యాంకు, 7 స్టార్ గార్బేజ్ ఫ్రీ సిటీ గుర్తింపు, వాటర్ ప్లస్, ఓడీఎఫ్ రీ–సర్టిఫికేషన్‌తో పాటు ‘ప్రామిసింగ్ స్వచ్ఛ శహర్–తెలంగాణ’ అవార్డు హైదరాబాద్‌కు దక్కిందని కమిషనర్ పేర్కొన్నారు.

**వ్యర్థాల నిర్వహణలో ఆధునిక సదుపాయాలు**

జవహర్‌నగర్‌లో 24 మెగావాట్ల ఆర్‌డీఎఫ్ ఆధారిత వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ (ఫేజ్–2), రోజుకు 1000 టన్నుల సామర్థ్యం గల ఆర్‌డీఎఫ్ తయారీ యూనిట్ ప్రారంభించినట్లు తెలిపారు. ఖైతలాపూర్‌లో 300 టన్నుల బయో–మెథనేషన్ ప్లాంట్, బయో–సీఎన్‌జీ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా నగర వ్యర్థాల ప్రాసెసింగ్ సామర్థ్యం రోజుకు 10 వేల టన్నులకు చేరిందన్నారు. పారిశుధ్య నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 10,752 చలాన్లు జారీ చేసి రూ.2.34 కోట్ల జరిమానా వసూలు చేసినట్టు తెలిపారు. పారిశుధ్యానికి సంబంధించిన ఫిర్యాదుల్లో 99 శాతం పైగా పరిష్కారం జరిగిందన్నారు.

**మెగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్**

పారిశుధ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు నగరం అంతటా మెగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టామని, ప్రస్తుతం ఇది మూడో రోజుకు చేరిందని కమిషనర్ తెలిపారు. ఈ డ్రైవ్‌లో భారీ చెత్త, లెగసీ వ్యర్థాలు, నిరుపయోగ వాహనాల తొలగింపుపై ప్రత్యేక ద ష్టి సారించినట్లు చెప్పారు. ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరుతూ, భారీ చెత్త లేదా నిరుపయోగ వాహనాల సమాచారం కోసం జీహెచ్ఎంసీ వాట్సాప్ నంబర్ 81259 66586, కాల్ సెంటర్ 040–2111 1111, లేదా సంబంధిత వార్డు/సర్కిల్ ఫీల్డ్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.



**ప్రజారోగ్యంలో పురోగతి**

2025లో డెంగ్యూ కేసులు 2024తో పోలిస్తే 30 శాతం తగ్గి 2,806 నుంచి 1,977కు చేరాయని తెలిపారు. ఆహార భద్రత చర్యల్లో భాగంగా వేలాది తనిఖీలు నిర్వహించి, నిబంధనల ఉల్లంఘనపై జరిమానాలు విధించినట్లు వివరించారు.

**మౌలిక వసతులు –ఇంజినీరింగ్ పనులు**

2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.2,706 కోట్ల వ్యయంతో 9,993 ఇంజినీరింగ్ పనులు చేపట్టామని, వీటిలో రూ.1,023 కోట్ల విలువైన 4,872 పనులు పూర్తయ్యాయని తెలిపారు. రహదారుల అభివద్ధి, స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్, ఫ్లైఓవర్లు, రోడ్ ఓవర్ బ్రిడ్జల నిర్మాణంతో నగర మౌలిక వసతులు మరింత బలపడ్డాయని పేర్కొన్నారు.

**డిజిటల్ గవర్నెన్స్, ఆదాయ వ ద్ధి**

డ్రోన్ సర్వే ఆధారిత జీఐఎస్ మ్యాపింగ్, ఆస్తి పన్ను సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. 2025 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రూ.1,512 కోట్ల ఆస్తి పన్ను వసూలు జరిగిందని, ఇది గత ఏడాదితో పోలిస్తే 8 శాతం అధికం అని వెల్లడించారు.

**పర్యావరణం–పట్టణ జీవ వైవిధ్యం**

వనమహోత్సవంలో 25 లక్షల మొక్కలు నాటడం, 40 కొత్త పార్కుల అభివ ద్ధి, కేంద్ర డివైడర్లు, ఫ్లైఓవర్ల సుందరీకరణతో నగరానికి హరిత శోభ పెరిగిందని తెలిపారు.

**పౌరుల భాగస్వామ్యమే విజయానికి మార్గం**

27 పట్టణ స్థానిక సంస్థల విలీనంతో జీహెచ్ఎంసీ పరిధి 300 వార్డులు, 60 సర్కిళ్లు, 12 జోన్లకు విస్తరించిందని పేర్కొంటూ, “నగరాన్ని శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచాలంటే ప్రజల సహకారం తప్పనిసరి. పారిశుధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత” అని కమిషనర్ పిలుపునిచ్చారు.

# ఓటర్ జాబితా డౌన్‌లోడ్ చేసుకోవాలి..



- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని
- లోకల్ బాడీస్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్ర ఎన్నికల సంఘానికి సంబంధించిన టీ పోల్ నుంచి ఓటర్ జాబితా డౌన్ లోడ్ చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. టీ పోల్ నుంచి ఓటర్ జాబితా డౌన్ లోడ్ తదితర అంశాలపై అన్ని జిల్లాల లోకల్ బాడీస్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా టీ పోల్ నుంచి ఓటర్ జాబితా డౌన్ లోడ్ ఎలా చేసుకోవాలి? అనే విధానంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. పలువురు అనుమానాలు నివృత్తి చేశారు. రాష్ట్ర స్థాయిలో నోడల్ అధికారులు సహాయం చేసేందుకు సిద్ధంగా ఉంటారని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. ఓటర్ జాబితా డౌన్ లోడ్ చేసుకొని వార్డుల వారీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. గురువారం సాయంత్రం ఐదు గంటలలోగా వార్డు ల వారీగా డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేసేందుకు పనులు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, టీపీఓ లు అన్సార్, సాయి కృష్ణ, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్‌షిప్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జిల్లా అధికారులు, ఎంఈఓలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో సమీక్ష



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రి, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రి, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులు, తదితర అంశాలపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జిల్లా అధికారులు, ఎంఈఓలు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో మంగళ వారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ దరఖాస్తులు లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన విద్యార్థులు అందరూ ప్రి, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అన్నారు. స్కాలర్షిప్ నమోదు కోసం ఎవరికైనా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు లేకుంటే వాటిని వెంటనే సంబంధిత విద్యార్థికి అందించే బాధ్యత సంబంధిత తహసీల్దార్ చూసుకోవాలని స్పష్టం చేశారు. అర్హులైన అందరు విద్యార్థులు పోస్ట్ ,ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం నమోదు అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, డీఈఓ వినోద్ కుమార్, డీఎస్సీడీఓ రవీందర్ రెడ్డి, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ భారతి, ఎల్డీఎం మల్లికార్జున రావు తదితరులు ఉన్నారు.

## ఉత్తరాఖండ్‌లో రైలు ప్రమాదం.. 74 మందికి గాయాలు

**బలగం టీవీ, హైదరాబాద్:**

ఉత్తరాఖండ్ రాష్ట్రం చమోలీ జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గోపేశ్వర్ ప్రాంతంలోని పిపల్‌కోటి టన్నెల్‌లో రెండు లోకో రైళ్లు పరస్పరం ఢీకొనడంతో 74 మంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. టన్నెల్‌లో పనులకు వెళ్లేందుకు 109 మంది కార్మికులను తీసుకెళ్తున్న లోకో రైలు, పరికరాలు తరలిస్తున్న మరో లోకో రైలును ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఢీకొన్న సమయంలో రైళ్లలో ఉన్న కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి.

# తన అభిమాని కుమారునికి నామకరణం చేసిన కేసీఆర్



- అభిమాన నేత చేతుల మీదుగా నామకరణం: ఉద్యమకారుడి బిడ్డకు 'సుమన్' అని పేరు పెట్టిన కేసీఆర్
- శతమానం భవతీ సుమన్
- ఫలించిన తొమ్మిది నెలల ఉద్యమ దంపతుల నిరీక్షణ

**బలగం టీవీ, హైదరాబాద్:**

తెలంగాణ ఉద్యమకారుల పట్ల తనకున్న ప్రేమాభిమానాలను బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి చాటుకున్నారు. తమ కుమారునికి ప్రియతమ నేత కేసీఆర్ చేతుల మీదుగానే నామకరణం చేయించుకోవాలన్న ఒక ఉద్యమ దంపతుల తొమ్మిది నెలల సుదీర్ఘ నిరీక్షణ, వైకుంఠ ఏకాదశి పర్వదినం నాడు సాకారమైంది.

**తొమ్మిది నెలల నిరీక్షణ ఫలించింది..**

వికారాబాద్ జిల్లా, పరిగి నియోజకవర్గంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన దొడ్ల నర్సింహులు తెలంగాణ ఉద్యమకాలం నుండి కేసీఆర్ కి వీరాభిమాని. నర్సింహులు, అనిత దంపతులకు కుమారుడు జన్మించినప్పటి నుండి, ఆ బాబుకు కేసీఆర్ పేరు పెట్టాలని వారు బలంగా నిశ్చయించుకున్నారు. ఇందుకోసం వారు గత తొమ్మిది నెలలుగా ఎదురుచూస్తున్నారు.

**నందినగర్ నివాసంలో నామకరణ వేడుక..**

మంగళవారం వైకుంఠ ఏకాదశి పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని, నర్సింహులు కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేసీఆర్ ని కలిశారు. ఆ ఉద్యమ దంపతుల విన్నపాన్ని మన్నించిన కేసీఆర్, వారిని ఆప్యాయంగా పలకరించి బాబును ఎత్తుకున్నారు. వేద పండితుల సలహా మేరకు, బాబు జన్మ నక్షత్రాన్ని అనుసరించి 'సుమన్' అని నామకరణం చేశారు.

తమ అభిమాన నాయకుడు తమ బిడ్డకు పేరు పెట్టడంపై నర్సింహులు దంపతులు హర్షం వ్యక్తం చేశారు. "మా బిడ్డకు కేసీఆర్ ఆశీస్సులు లభించడం, ఆయన చేతుల మీదుగా నామకరణం జరగడం మా జీవితంలో మర్చిపోలేని తీపి జ్ఞాపకం" అని వారు భావోద్వేగంతో పేర్కొన్నారు.



## కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, తిరుమల:**

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి చేరుకున్న ఆయనకు, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు మరియు అర్చకులు ఘన స్వాగతం పలికారు. వైకుంఠ ఏకాదశి అత్యంత విశిష్టమైన రోజు కావడంతో, ముఖ్యమంత్రి వైకుంఠ ద్వారం (ఉత్తర ద్వారం) గుండా వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## యూట్యూబర్ అన్వేష్‌పై కేసు నమోదు

**బలగం టీవీ, హైదరాబాద్**



సోషల్‌మీడియాలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ అన్వేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఖమ్మం జిల్లా ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ పరిధిలో అన్వేష్‌పై కేసు నమోదైనట్లు ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ తెలిపారు. విశాఖపట్నానికి చెందిన అన్వేష్ విదేశాల్లో నివసిస్తూ యూట్యూబ్ వేదికగా వీడియోలు విడుదల చేస్తున్నాడని, వాటిలో హిందువులు ఆరాధించే సీతాదేవి, ద్రౌపదీ దేవిలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ వ్యాఖ్యలతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని పేర్కొంటూ దానవాయిగూడెంకు చెందిన జి. సత్యనారాయణరావు ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ వెల్లడించారు. ఈ వ్యవహారం సోషల్‌మీడియాలో చర్చనీయాంశంగా మారగా, అభ్యంతరకర కంటెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## జనగామలో దంపతుల ఆత్మహత్య

**పురుగుల మందు తాగి..**

**బలగం టీవీ, జనగామ**



జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం చిన్న రామచెర్ల గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. అనారోగ్యంతో బాధపడుతున్న దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా విషాదం నింపింది. గ్రామానికి చెందిన రామ్‌రెడ్డి, లక్ష్మి దంపతులు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. వైద్య చికిత్సలు ఫలించకపోవడంతో మానసికంగా కుంగిపోయిన వారు అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలుస్తోంది. సమాచారం అందుకున్న బచ్చన్నపేట ఎస్ఐ హమీద్ తన సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది.

## ఇప్పటికీ చర్చనీయాంశంగానే బీహార్ హిజాబ్ కాంట్రవర్సీ

- విధుల్లో చేరని ఆయుష్ వైద్యురాలు సుస్రత్ పర్వీన్

**బలగం టీవీ, హైదరాబాద్:**

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చేతుల మీదుగా జరిగిన నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో చోటుచేసుకున్న హిజాబ్ వివాదం ఇప్పటికీ చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. ఈ ఘటనలో కేంద్ర బిందువుగా నిలిచిన ఆయుష్ వైద్యురాలు సుస్రత్ పర్వీన్ ఇప్పటివరకు విధుల్లో చేరకపోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆమెకు సబల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోస్టింగ్ కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు. అయితే, నియామక పత్రాలు పొందిన అభ్యర్థులు డిసెంబర్ 31లోగా విధుల్లో చేరాల్సి ఉండగా, సుస్రత్ పర్వీన్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి సమాచారం రాలేదని అధికారులు తెలిపారు. నిర్ణీత గడువు లోపల విధుల్లో చేరకపోతే నియామకం రద్దయ్యే అవకాశముందని స్పష్టం చేశారు. సమాచారం ప్రకారం, హిజాబ్ వివాదం అనంతరం సుస్రత్ పర్వీన్ తన కుటుంబంతో కలిసి పట్నా నుంచి కోల్‌కతాకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ఘటన తర్వాత ఆమె మీడియాతో మాట్లాడకుండా ఉండాలని భర్త సూచించినట్లు కూడా సమాచారం. సబల్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సర్జన్‌గా పనిచేస్తున్న డా. విజయ్ కుమార్ మాట్లాడుతూ, సుస్రత్ పర్వీన్ ఇప్పటివరకు విధులకు హాజరు కాలేదని తెలిపారు. నియమిత వైద్యులు ముందుగా సివిల్ సర్జన్ కార్యాలయంలో హాజరై, ఆపై తమకు కేటాయించిన కేంద్రాల్లో బాధ్యతలు స్వీకరించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.



## వేములవాడ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

- మెనూ కచ్చితంగా పాటించాలి.
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

విద్యార్థులకు మెనూ కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయం(మానాల)లో ఇంచార్జి కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్, స్టోర్ రూమ్ లో ఆహార సామగ్రి, కోడి గుడ్లు, కూరగాయలు, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడి గుడ్లు ఇస్తున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యాలయంలో విద్యార్థులందరూ చదువు పై శ్రద్ధ పెట్టాలని, ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఇంచార్జి కలెక్టర్ పేర్కొన్నారు. తాము అనుకున్న ఉద్యోగాలు, ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపు ఇచ్చారు. ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యాలయం ఆవరణ శుభ్రంగా ఉండాలని, ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు.



## పట్టాదారు పాస్ పుస్తకం వివరాలు నమోదు చేయాలి..

- ఎరువుల పంపిణీలో ఇబ్బందులు లేకుండా చూడాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- పెద్దూర్ పీఏసీఎస్, సిరిసిల్లలోని ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాప్ లో తనిఖీ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఎరువులు కొనుగోలు చేస్తున్న రైతుల పట్టాదారు పాస్ పుస్తకం వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాప్, పెద్దూర్ లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో బుధవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయా షాపుల్లో ప్రస్తుతం రిజిస్టర్, స్టాక్ ఎరువుల నిలువలను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని బస్తాల ఎరువులు విక్రయించారో ఆరా తీశారు. ఇప్పటిదాకా విక్రయించిన ఎరువుల, రైతుల పట్టాదారు పాస్ పుస్తకం వివరాలు తనిఖీ చేసి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫెర్టిలైజర్ షాప్ లు ఉదయమే తెరవాలని, సాగుకు అనుగుణంగా ఎరువుల పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు..

**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల మోడల్ స్కూల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కార్తీక్ ఆధ్వర్యంలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ.. తర్వాత చలికాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, రక్తహీనత, నోటి మరియు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.అలాగే బాలికల వసతి గృహాన్ని సందర్శించి పిల్లలకు వేడివేడి ఆహారాన్ని అందించాలని, ఆహార పదార్థాలపై ఈగలు, దోమలు వాలకుండా చూసుకోవాలని, వార్డెన్ కు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ హేమలత, హెల్త్ అసిస్టెంట్ బిల్లా అశోక్, ప్రిన్సిపల్ రఘునాథ్, ఏఎన్ఎం తిరుమల, ఆశ కార్యకర్త లత తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ ఆలయంలో సౌకర్యాలు కల్పించాలి..

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్, జాతర చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం



**బలగం టీవీ, వేములవాడ:**

దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న మహా శివరాత్రి జాతర ఏర్పాట్లపై అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. మంగళవారం వేములవాడలోని భీమేశ్వర సదన్ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో భారీ సమన్వయ సమావేశం నిర్వహించారు. మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్, జాతర చైర్ పర్సన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

జాతర తేదీలు 2026 ఫిబ్రవరి 14, 15, 16 తేదీల్లో మహా శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. శాఖల మధ్య సమన్వయం లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు ఆదేశించారు. మౌలిక సదుపాయాలు తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ దీపాలు, తాత్కాలిక షెడ్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పకడ్బందీగా ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీని కోరారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రతిష్టను పెంచేలా జాతరను విజయవంతం చేయాలని, భక్తుల సౌకర్యార్థం నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి జాతర చైర్మన్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధ్యక్షత వహించగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బీ గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## న్యూ ఇయర్ వేడుకలు శాంతియుతంగా జరుపుకుందాం

- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు..
- జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు.
- జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

నూతన సంవత్సర వేడుకలను ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపిఎస్ పిలుపునిచ్చారు. కొత్త ఏడాది ఆనందంతో ప్రారంభం కావాలే తప్ప, చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల అది విషాదంగా మారకూడదని ఆయన హితవు పలికారు. డిసెంబర్ 31 వేడుకల నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోందని ఆయన వెల్లడించారు.


వేడుకల పేరుతో అతిగా ప్రవర్తించే వారిపై పోలీసులు నిఘా ఉంచారని ఎస్పీ పేర్కొన్నారు. ప్రధానంగా డిసెంబర్ 31 రాత్రి జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తారు. మద్యం సేవించి వాహనం నడిపితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తారు. అతి వేగంగా వాహనాలు నడపడం, బైక్ రేసింగ్ చేయడం, త్రిబుల్ రైడింగ్ చేయడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. వేడుకల్లో డీజేలు, అధిక శబ్దాలు చేసే పరికరాలపై పూర్తి నిషేధం విధించారు. సైలెన్సర్లు తొలగించి బైక్ లతో శబ్దం చేస్తూ తిరిగే వారిపై కేసులు నమోదు చేస్తారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే, సదరు వాహన యజమానులతో పాటు తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

న్యూ ఇయర్ వేడుకల పేరుతో రహదారులపై కేకులు కట్ చేయడం, బాటసారులను ఇబ్బంది పెట్టడం లేదా ప్రజా భద్రతకు భంగం కలిగించడం వంటివి చేస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని కోరారు. చివరగా, 2026 నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తూ, జిల్లా ప్రజలందరికీ పోలీస్ శాఖ తరపున ఆయన ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో చైనా మంజా నిషేధం..






- నిబంధనలకు విరుద్ధంగా చైనా మాంజా విక్రయించినా, వినియోగించినా చట్టరీత్యా చర్యలు
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో ప్రభుత్వం నిషేధించిన చైనా మంజా (నైలాన్ / సింథటిక్ దారాలు) విక్రయం,వినియోగం పూర్తిగా నిషేధించబడిందని జిల్లా ఎస్పీ గారు తెలిపారు.నిషేధాన్ని ఉల్లంఘిస్తూ చైనా మంజాను విక్రయించినా, వినియోగించినా సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో యువత గాలిపటాలను ఎగరవేయడానికి సిద్ధమవుతున్న వేళ, కొందరు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా చైనా మంజాను విక్రయాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టడం జరుగుతుందని,నైలాన్, సింథటిక్ దారాలతో తయారైన ఈ చైనా మంజా మనుషులకు, వాహనదారులకు తీవ్ర ప్రమాదం కలిగించడంతో పాటు ఎగిరే పక్షులకు ప్రాణాంతకంగా మారుతున్నదని, అలాగే పర్యావరణానికి కూడా తీవ్రమైన నష్టం కలిగిస్తున్నదని పేర్కొన్నారు. ఈ ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు జిల్లాలో చైనా మంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.

జిల్లాలో చైనా మంజా విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకొని ఆకస్మిక తనిఖీలు చేపట్టడం జరుగుతుదన్నారు. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, చైనా మంజా వినియోగాన్ని పూర్తిగా నివారించి, ఎవరికీ హాని కలగని సాధారణ కాటన్ దారంతో గాలిపటాలను ఎగురవేయాలని జిల్లా ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఎవరైనా చైనా మంజాను విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆయన కోరారు.

# బాలల సంరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలి..



- బాల కార్మిక వ్యవస్థపై జీరో టాలరెన్స్ విధానం అమలు..
- చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చెపిస్తే క్రిమినల్ కేసులు తప్పవు..
- జనవరి 1 వతేది నుండి 31వ తేదీ వరకు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం..
- బాలకార్మికులు కనిపిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ వారి కి సమాచారం అందించండి.
- జిల్లా ఎస్పీ తో కలసి సమావేశం నిర్వహించిన ఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు మర్రిపెల్లి చందన.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తో కలసి ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంపై వివిధ శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించాఉ. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపెల్లి చందన. జిల్లాలో జనవరి 1 వతేది నుండి 31వ తేదీ వరకు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు మర్రిపెల్లి చందన అన్నారు.

ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ.. చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చేయించడం, పనులలో పెట్టుకోవడం నేరమని,అలా చేస్తే సంబంధిత యజమానులపై క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థపై ప్రభుత్వం జీరో టాలరెన్స్ విధానంను కఠినంగా అమలు చేస్తున్నదని స్పష్టం చేశారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతోనే బాలల రక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. అదేవిధంగా రానున్న రోజుల్లో మళ్లీ ఈ పిల్లలు బాల కార్మికులుగా మారకుండా వారికి పునరావాస కార్యక్రమాలు చేపట విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన బాధ్యత వివిధ శాఖల అధికారులపై వుందని, బాల కార్మిక రహిత సమాజమే మనందరి లక్ష్యం పనిచేయాలని తెలియజేసారు.

అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణకు జిల్లా పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని, బాల కార్మికులపై ఫిర్యాదులు అందిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జనవరి 1 వతేది నుండి 31వ తేదీ వరకు జరిగే ఆపరేషన్ స్మైల్ కార్యక్రమానికి అదనపు ఎస్పీ చంద్రయ్య ఆధ్వర్యంలో జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ డివిజన్ లలో ఎస్.ఐ స్థాయి అధికారి వివిధ శాఖల అధికారులతో రెండు టీమ్ లు ఏర్పాటు చేసి జిల్లాలో పిల్లలతో పనిచేసే అవకాశాలు ఉన్న పలు పరిశ్రమలు,హెూటల్స్, వ్యాపార సముదాయాలు, గోదాములు,మెకానిక్ షాపులు,హెూటల్స్, ఇటుక బట్టిలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. స్కూల్స్ కు వెళ్లకుండా వివిధ కారణాల వల్ల డ్రాపౌట్ అయిన పిల్లల తల్లి దండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి తిరిగి వారిని పాఠశాలకు పంపే ఏర్పాటు చేసి వారికి కొత్త జీవితాన్ని ఇచ్చేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

18 సంవత్సరాల లోపు పిల్లలతో పని చేయిస్తున్న వారిపై 2025 సంవత్సరంలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ లో 22 మందిపై క్రిమినల్ కేసులు చేసి 129 సంరక్షించడం జరిగిందని ఎస్పీ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, dwo లక్ష్మీరాజాం, CWC చైర్పర్సన్ అంజయ్య, ఎస్.ఐ లు, వివిధ శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీర్ బాటిల్‌తో సారా టెండూల్కర్.. వీడియో వైరల్

**బలగం టీవీ, హైదరాబాద్**



భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన ఓ వీడియో ఆమెను చర్చల కేంద్రంగా నిలిపింది. ఆ వీడియోలో సారా చేతిలో బీర్ బాటిల్ పట్టుకుని కనిపించడంతో నెటిజన్ల మధ్య తీవ్ర చర్చ మొదలైంది. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా సారా తన స్నేహితులతో కలిసి గోవాలో విహరిస్తున్నట్లు సమాచారం. ఈ సమయంలో ఆమెను వీడియో తీసిన ఓ వ్యక్తి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీడియోలో సారా చేతిలో బీర్ బాటిల్ ఉన్నట్లు కనిపించడంతో కొందరు నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. సచిన్ టెండూల్కర్ కుమార్తె ఇలాంటి ప్రవర్తన చేయడం సరైందా అంటూ విమర్శలు గుప్పించారు.

అయితే మరోవైపు సారా తరఫున నిలిచినవారూ లేకపోలేదు. "బీర్ తాగితే తప్పేముంది?", "ఆమె వ్యక్తిగత జీవితం ఆమె ఇష్టం", "ఇప్పటికీ మహిళలపై ఈ స్థాయి విమర్శలేనా?" అంటూ పలువురు సోషల్ మీడియా వేదికగా ఆమెకు మద్దతుగా మాట్లాడారు. సచిన్ కూతురైనంత మాత్రాన ఆమెపై నిబంధనలు విధించాలా? అంటూ ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, సారా టెండూల్కర్ గతంలోనే తాను క్రికెట్‌ను వృత్తిగా ఎంచుకోలేదని స్పష్టం చేశారు. తండ్రి సచిన్ టెండూల్కర్ ఆడిన గొప్ప ఇన్నింగ్స్ తనకు గుర్తున్నప్పటికీ, తాను మాత్రం ఆ దారిలో నడవలేదని వెల్లడించారు. తన సోదరుడు అర్జున్ టెండూల్కర్ క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్నప్పటికీ, తాను భిన్నమైన మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సారా టెండూల్కర్ వ్యాపార రంగంలో చురుకుగా ఉన్నారు. ముంబైలో 'పిలేట్స్ అకాడమీ బై సారా టెండూల్కర్' పేరుతో వెల్‌నెస్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. క్లినికల్ న్యూట్రిషన్, పబ్లిక్ హెల్త్ రంగాల్లో ఆసక్తి ఉన్న ఆమె, ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించే కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో, వ్యక్తిగత జీవితం వ్యక్తిగతంగానే చూడాలన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఈ ఘటనపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# 'టాక్సిక్' నుంచి నయనతార ఫస్ట్ లుక్ విడుదల

- భారీ అంచనాల మధ్య విడుదలకు సిద్ధమవుతున్న పాన్ ఇండియా మూవీ

**బలగం టీవీ, హైదరాబాద్**




కేజీఎఫ్' సిరీస్‌తో దేశవ్యాప్తంగా స్టార్‌డమ్ సంపాదించిన కన్నడ నటుడు యష్ నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. నేషనల్ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ తాజాగా మరో కీలక అప్‌డేట్‌తో వార్తల్లో నిలిచింది. ఈ చిత్రంలో లేడీ సూపర్‌స్టార్ నయనతార కీలక పాత్రలో నటిస్తుండగా, ఆమె ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'గంగా' అనే పవర్‌ఫుల్ పాత్రలో నయనతార కనిపించనుండగా, విడుదలైన పోస్టర్‌లో ఆమె లుక్ తీవ్రతతో ఆకట్టుకుంటోంది. యష్ %--% నయనతార జోడీ తొలిసారి తెరపై కనిపించనుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి.

**2026 మార్చిలో గ్రాండ్ రిలీజ్**

కేజీఎఫ్ 2' తర్వాత యష్ నటిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ క్రేజ్ నెలకొంది. ఈ సినిమాను 2026 మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఉగాది, గుడి పడ్వా, ఈద్ వంటి పండుగల సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ తేదీని ఖరారు చేసినట్లు సమాచారం.

**పాన్ ఇండియా స్థాయిలో విడుదల**

ఈ చిత్రాన్ని ఇంగ్లీష్, కన్నడ భాషల్లో ఏకకాలంలో చిత్రీకరిస్తుండగా, తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లోనూ డబ్ చేసి విడుదల చేయనున్నారు. కె.వి.ఎన్ ప్రొడక్షన్స్, మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ, యష్ సంయుక్తంగా ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భారీ స్టార్‌కాస్ట్, బలమైన కథాంశం, అంతర్జాతీయ స్థాయి టెక్నికల్ వాల్యూస్‌తో 'టాక్సిక్' మరో పాన్ ఇండియా సెన్సేషన్‌గా మారుతుందనే అంచనాలు సినీ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

# కోమాలోకి ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డామియన్ మార్టిన్

**బలగం టీవీ, హైదరాబాద్**



ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ డామియన్ మార్టిన్ (54) తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. మెనింజిటిస్ వ్యాధితో బాధపడుతున్న ఆయనను బాక్సింగ్ డే రోజున క్వీన్స్‌ల్యాండ్‌లోని ఆస్పత్రికి తరలించగా, ప్రస్తుతం ఇండ్యూస్డ్ కోమాలో చికిత్స అందిస్తున్నారు. మార్టిన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో అభిమానులు, క్రికెట్ వర్గాల్లో ఆందోళన నెలకొంది. ఆస్ట్రేలియా తరఫున మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందిన మార్టిన్‌కు ఉత్తమ వైద్యం అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులు సమీపంలోనే ఉండగా, మాజీ క్రికెటర్లు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. ఆస్ట్రేలియా మాజీ వికెట్ కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ కూడా స్పందిస్తూ, మార్టిన్‌కు మెరుగైన చికిత్స అందుతోందని, కుటుంబం ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు. 1992 నుంచి 2006 వరకు ఆస్ట్రేలియా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన డామియన్ మార్టిన్ 67 టెస్టు మ్యాచ్‌లు, 208 వన్డేలు ఆడారు. టెస్టుల్లో 46 సగటుతో 4,406 పరుగులు, వన్డేల్లో 40 సగటుతో 5,346 పరుగులు సాధించారు. 13 టెస్టు సెంచరీలు, 5 వన్డే శతకాలు ఆయన ఖాతాలో ఉన్నాయి. 2003 వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా విజయంలో మార్టిన్ కీలక పాత్ర పోషించారు. ఫైనల్ మ్యాచ్‌లో భారత్‌పై 88 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి, రికీ పాంటింగ్‌తో కలిసి 234 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 2006లో అకస్మాత్తుగా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన మార్టిన్, తన ఆటతో అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిపై ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తూ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు.

# శ్రేయస్ అయ్యర్ రీఎంట్రీపై అనిశ్చితి

- గాయం నుంచి పూర్తిగా కోలుకునే వరకు సమయం పట్టే అవకాశం

**బలగం టీవీ, హైదరాబాద్**



భారత స్టార్ బ్యాట్స్‌మన్ శ్రేయస్ అయ్యర్ మళ్లీ మైదానంలో అడుగుపెట్టేందుకు మరికొంత సమయం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్ సందర్భంగా గాయపడిన అతడు ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదని సమాచారం. క్యాచ్ పట్టే క్రమంలో కిందపడిన సమయంలో కడుపు భాగానికి తీవ్ర గాయం కావడంతో ప్లీహం (స్ప్లీన్) దెబ్బతింది. ఆ గాయం కారణంగా అంతర్గత రక్తస్రావం జరిగినట్లు వైద్యులు గుర్తించారు. ఈ ఘటన తర్వాత శ్రేయస్ అయ్యర్‌ను ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ, పూర్తిగా కోలుకోవడానికి మరికొంత సమయం అవసరమని వైద్య వర్గాలు చెబుతున్నాయి. గాయం ప్రభావంతో శరీర బరువు దాదాపు ఆరు కిలోలు తగ్గినట్లు సమాచారం. మసిల్ లాస్ కారణంగా శారీరక దృఢత్వం తగ్గినట్లు డాక్టర్లు పేర్కొన్నారు.

వచ్చే నెలలో జరిగే న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు శ్రేయస్ అందుబాటులో ఉంటాడా లేదా అన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవల మీడియాలో వెలువడిన కథనాల ప్రకారం, ఆయన విజయ్ హజారే ట్రోఫీలో ఆడే అవకాశాలు ఉన్నాయని పేర్కొనగా, జనవరి 3, 6 తేదీల్లో జరిగే మ్యాచ్‌లకు అందుబాటులోకి రావచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే బీసీసీఐ వర్గాలు మాత్రం పూర్తి స్థాయి ఫిట్‌నెస్ లేకుండా శ్రేయస్‌ను మైదానంలోకి దింపే అవకాశం లేదని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా 50 ఓవర్ల ఫార్మాట్‌లో పూర్తి స్థాయిలో ఫీల్డింగ్ చేయగలగడం కీలకమని పేర్కొంటున్నాయి. ప్రస్తుతం శ్రేయస్ పునరావాస శిక్షణ (రిహ్యాబిలిటేషన్)లో భాగంగా తేలికపాటి ఫిట్‌నెస్ డ్రిల్స్, స్కిల్ ట్రైనింగ్ ప్రారంభించినట్లు సమాచారం. శరీరం పూర్తిగా కోలుకుని, ఫిట్‌నెస్ ప్రమాణాలు చేరుకున్న తర్వాతే అతడిని పోటీ క్రికెట్‌కు అనుమతించే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# రాజకీయ నేపథ్యంతో విశ్వక్ సేన్ కొత్త చిత్రం

**బలగం టీవీ, హైదరాబాద్**




టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో విశ్వక్ సేన్ కొత్త ఏడాదిలో కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు. ఇటీవల వరుస సినిమాలతో ప్రేక్షకులను పలకరించిన ఆయనకు 2025 సంవత్సరం మాత్రం ఆశించిన స్థాయిలో ఫలితం ఇవ్వలేదనే చెప్పాలి. ఈ ఏడాది విడుదలైన లైలా సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ప్రస్తుతం ఆయన ఆశలన్నీ 'ఫంకీ' చిత్రంపైనే ఉన్నాయి. ఈ సినిమా 2026 ఫిబ్రవరిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఇక 2026కు ముందే అభిమానులకు సర్‌ప్రైజ్ ఇస్తూ విశ్వక్ సేన్ కొత్త సినిమా అనౌన్స్‌మెంట్‌కు సిద్ధమయ్యారు. న్యూ ఇయర్ సందర్భంగా ఆయన ఓ కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించనున్నారు. ఈసారి రాజకీయ నేపథ్యంతో తెరకెక్కే చిత్రంలో నటించనున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రానికి 'పిండం' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సాయి కిరణ్ దైదా దర్శకత్వం వహించనున్నారు. పిండం సినిమాను నిర్మించిన కలాహి మీడియానే ఈ ప్రాజెక్ట్‌ను కూడా నిర్మించనుంది. కథ నచ్చడంతో విశ్వక్ సేన్ వెంటనే ఓకే చెప్పినట్లు ఫిలింనగర్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**నేడు అధికారిక ప్రకటన**

నూతన సంవత్సర శుభాకాంక్షలతో పాటు జనవరి 1వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఈ సినిమా అనౌన్స్‌మెంట్ టీజర్‌ను విడుదల చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రీ-లుక్ పోస్టర్‌లో సింహాసనం కనిపించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది రాజకీయ నేపథ్యంతో కూడిన పవర్‌ఫుల్ కథ అని సంకేతాలు ఇస్తోంది.

ఇదిలా ఉండగా, విశ్వక్ సేన్ ఖాతాలో 'ఈ నగరానికి ఏమైంది 2' కూడా ఉంది. ఈ సినిమాపై కూడా అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. మొత్తంగా 2026లో విశ్వక్ సేన్ కెరీర్ కొత్త మలుపు తిరిగేలా కనిపిస్తోంది. రాజకీయ కథాంశంతో వస్తున్న ఈ కొత్త సినిమా ఆయన ఇమేజ్‌ను మరింత బలపరుస్తుందా అనే ఉత్కంఠ సినీ వర్గాల్లో నెలకొంది.